క్లుప్తంగా

ఎస్సీ కాలనీలో చెత్తను తొలగించరూ..



పాన్‌గల్: మండల కేంద్రంలోని దామ చెరువు సమీపంలోని ఎస్సీ కాలనీలో డ్రెయినేజీ కాల్వలను శుభ్రం చేసి, చెత్తను తొలగించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. కాలనీలో నెల రోజుల నుంచి డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తొలగించిన చెత్త మళ్లీ మురుగు కాల్వలో పడుతుందని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీలో డ్రెయినేజీని శుభ్రం చేయడం, చెత్తను తొలగించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసి, మాజీ ఆర్మీ జవాన్ ఆదాం రాజ్ డిమాండ్ చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



పాన్‌గల్: మండలంలోని అన్నారంతండాకు చెందిన శ్రీను నాయక్‌కు మంజూరైన రూ.12 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును గురువారం తండా కాంగ్రెస్ నాయకులు అందజేశారు. చెక్కు మంజూరు చేయించిన మంత్రి జూపల్లికి, మంజూరుకు కృషి చేసిన మండల కాంగ్రెస్ నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రేఖ్యానాయక్, బిక్యానాయక్, ప్రేమ్‌నాయక్, మైబూష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



వీపనగండ్ల: మండలంలోని తూంకుంట ఇసుక రీచ్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ రాణి తెలిపారు. తూంకుంట గ్రామానికి చెందిన వెంకటస్వామి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇసుకను తరలిస్తుండగా.. అదుపులోకి తీసుకుని ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేశామన్నారు. మండలంలో అక్రమంగా ఇసుకను తరలించే ట్రాక్టర్ యజమానులపై ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భగవాన్ సత్యసాయి జయంతి వేడుకలు



ఆత్మకూర్: భగవాన్ శ్రీసత్యసాయిబాబ 99వ జయంతి వేడుకల్లో భాగంగా నిత్యపూజలు కొనసాగుతున్నాయి. గురువారం స్థానిక సత్యసాయి మందిరంలో రెడ్‌క్రాస్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 25 మంది సత్యసాయి భక్తులు రక్తదానం చేశారు. ఈసందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ కలాంపాష, ప్రముఖ న్యాయవాది తిప్పారెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేసినవారవుతామని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా రక్తదానం చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవాసమితి నిర్వాహకులు నవీన్, రఘు, ముక్తేశ్వర్, రవీందర్‌రెడ్డి, రామకృష్ణ, రమేష్, నాగరాజు, నర్సింహులు, వాణి, రెడ్‌క్రాస్ నిర్వాహకులు లక్ష్మీపతి, మహమూద్, రమేష్, లక్ష్మి, అలీ, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠాపన పూజలు

ఆత్మకూర్: మండలంలోని కత్తేపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీగణపతి, సుబ్రమణ్య, వీరభద్ర, పార్వతి, శివలింగ, నంది, శిఖర ధ్వజ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే బాలకిష్టాపూర్‌లో నూతనంగా ప్రతిష్ఠించిన సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో గాడి కృష్ణమూర్తి, గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, నల్గొండ శ్రీను, నాగేష్, మణివర్ధన్‌రెడ్డి, రఫీఖ్, తుకారాంనాయక్, సత్యన్న, చిరంజీవి, విష్ణువర్ధన్‌రెడ్డి, కొండన్న, దామోదర్‌రెడ్డి, శివన్న, భక్తులు, రైతులు ఉన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

వనపర్తి: జిల్లా మత్స్యకారుల అభ్యున్నతికి కృషి చేస్తానని సంఘం నాయకులు, బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ చెప్పారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రేమ్ టైలర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రపంచ మత్స్యకార దినోత్సవ వేడుకలను ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని, బీసీ డీ నుంచి బీసీ ఏ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సమాజంలో ఉన్న మూఢనమ్మకాలపై ప్రజల్లో చైతన్యం నింపేందుకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్న ప్రేమ్ టైలర్స్ యజమాని మన్యం ను ఆయన అభినందించారు. తన టైలర్ షాపులో రెండుజతల దుస్తులు కుట్టించుకున్న వారికి ఒక హెల్మెంట్ ఇచితంగా ఇస్తూ.. సామాజిక కార్యక్రమాలు చేపట్టడాన్ని ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో పుట్ట బాలరాజు, శ్రీను, కురుమయ్య, లక్ష్మయ్య, కొండన్న, బాలేమియా తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: ప్రభుత్వం మత్స్యకారులకు ఇచ్చిన హామీలను అమలు పరిచి వారు ఆర్థికంగా బలపడే విధంగా చూడాలని మండల మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రపంచ మత్స్యకార్మికుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటయ్య, సాయిబాబ, సురేష్, రాఘవేందర్, విష్ణు, మహేష్, గంగయ్య, నర్సింహా, బాలయ్య, మాసయ్య, రాముడు తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంలో మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మత్స్యకార సంఘం, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు డా.పగిడాల శ్రీనివాసులు మాట్లాడుతూ ముదిరాజ్‌ల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో పోరాడాలన్నారు. కార్యక్రమంలో బిచ్చన్న, బాలస్వామి, కృష్ణ, సింగోటం, నర్సింహ, రాజు, బాబు, వెంకటస్వామి, శ్రీను, అంజి, మన్నెం తదితరులు పాల్గొన్నారు.



వీపనగండ్లలో జెండా ఆవిష్కరిస్తున్న మత్స్యకారులు



వనపర్తిలో హెల్మెంట్ పంపిణీ చేస్తున్న శ్రీధర్



మదనాపురంలో..

ఖిల్లాఘనపురం: మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి అవసరమైన నిధులు విడుదల చేయాలని మత్స్యకారుల సంఘం మండల నాయకులు కృష్ణయ్య, గోపాల్, శ్రీనువాసులు, రాములు కోరారు. ఖిల్లాఘనపురం బస్టాండులో ముదిరాజ్‌లు జెండా విష్కరణ చేపట్టారు. మండల కేంద్రంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో మత్స్యకారుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ముదిరాజ్ మత్స్యకారులు చెన్నయ్య, విష్ణు, రాంచంద్రి, దేవేందర్, మధు, గోపాల్, అంజనేయులు, రాములు, కురుమయ్య, శేఖర్ తదిరతులు పాల్గొన్నారు.

మదనాపురం: మండల కేంద్రంలో మండల ముదిరాజ్‌లు వాల్‌పోస్టర్‌ను విడుదల చేసారు. కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, వెంకటస్వామి, చీర్ల శ్రీనివాసులు, చుక్క కృష్ణ, రవి, శాంతన్న, డబ్బా కృష్ణయ్య, బంగ్లా కృష్ణయ్య, శ్రీనివాసులు, బాలరాజు, రంగన్న, చింతకాయల శ్రీనివాసులు, వాకిటి వెంకటన్న, తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలో ప్రపంచ మత్స్యకార్మిక దినోత్సవాన్ని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మత్స్యకార మండల అధ్యక్షుడు గోల్డ్ బాలస్వామి, చింతకాయల కురుమూర్తి, కార్యదర్శి మహేష్, గోనెల సహదేవుడు, భీముడు, శ్రీనివాసులు, గోనెల భరత్ తదితరులు ఉన్నారు.

గోపాల్‌పేట: ముదిరాజులు స్థానిక మత్స్యకార భవనం ఎదుట జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బాల్‌రాజు, మేస్త్రీ బాలయ్య, రాములు, కోరమోని చంద్రయ్య, డైరెక్టర్లు గంగారం, వెంకటయ్య, మైబూస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

అమరచింత: డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఎండీ ఖదీర్ కు మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. వివరాలు.. బుధవారం పట్టణ శివారులో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా తిరుమలాపురం గ్రామానికి చెందిన ఖదీర్ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారని తెలిపారు. కేసు నమోదు చేసుకుని వనపర్తి కోర్టులో హాజరుపర్చగా జడ్జి వ్యక్తికి మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధించడంతో రిమాండ్‌కు తరలించామన్నారు.

ఐదుగురికి జరిమానా

ఆత్మకూర్: మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ఇద్దరికి న్యాయమూర్తి జరిమానాలు విధించారని ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. గురువారం వనపర్తి కోర్టులో ఆత్మకూర్‌కు చెందిన శ్రీకాంత్, నందిమల్ల సురేష్, గుంటిపల్లి రాములు కు రూ.1000 చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారని, అలాగే బహిరంగంగా మద్యం తాగిన ఆత్మకూర్‌కు చెందిన సద్దాం, శేఖర్ కు రూ.200 చొప్పున ఫైన్లు విధించారని తెలిపారు. తప్పతాగి వాహనాలు నడిపిన, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి చట్టపరంగా చర్యలు తప్పవని ఎస్‌ఐ నరేందర్ హెచ్చరించారు.

గోపాల్‌పేట: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రేవల్లి ఎస్‌ఐ రాము సూచించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిని గురువారం వనపర్తి కోర్టులో హాజరుపర్చగా.. జడ్జి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారని ఎస్‌ఐ తెలిపారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

అమరచింత: లగచర్ల బాధితులకు మద్దతు తెలిపేందుకు వెళ్తున్న సీపీఎం నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని సీపీఎం మండల కార్యదర్శి జీఎస్ గోపి ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ పిలుపు మేరకు తమ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో కలిసి లగచర్లకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న సీపీఎం ముఖ్య నాయకులను గురువారం ముందస్తు అరెస్టు చెసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా గోపి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వమంటూ పార్మాసిటీ పేరిట భూములను ప్రజల నుంచి బలవంతంగా లాక్కునేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం, అడ్డుకున్న వారిపై అక్రమ కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అజయ్, రమేష్ పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలే మార్గదర్శకులు కావాలి

వనపర్తి టౌన్: నేటి యువతరానికి, భావిభారత పౌరులకు శాస్త్రవేత్తలే మార్గదర్శకులు కావాలని మహనీయుల స్ఫూర్తి వేదిక కన్వీనర్ రాజారాం ప్రకాశ్ అన్నారు. సీవీ రామన్ 54వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భౌతికశాస్త్రంలో సీవీ రామన్ జరిపిన పరిశోధనలకు నోబెల్ బహుమతి లభించడంతో పాటుగా భారత ప్రభుత్వం భారతరత్నతో సత్కరించిందని గుర్తు చేశారు. విద్యార్థులు శాస్త్రవేత్తల జీవిత చరిత్రలను తెలుసుకుంటే వారి ఆలోచనల్లోనూ వినూత్న మార్పులు వస్తాయన్నారు. కార్యక్రమంలో గిరిరాజాచారి, నాయకంటి నరసింహశర్మ, బాలేమియా, రమేష్‌చారి, వెంకటేష్, రంగస్వామి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

క్రీడలతో మానసికోల్లాసం

కొత్తకోట: ఆటలు సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడుతాయని కార్డియాలజీ వైద్యుడు భరత్‌కుమార్‌గౌడ్ అన్నారు. నాలుగు రోజులుగా స్థానిక ఆరోగ్య వాకింగ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెన్నికాయిట్ పోటీలు గురువారంతో ముగిశాయి. పోటీలో మొత్తం 8 జట్లు పాల్గొనగా విన్నర్‌గా ముంత రామకృష్ణ జట్టు, రన్నరప్‌గా రాజేష్ జట్టు నిలిచాయి. చివరి రోజు క్లబ్ నిర్వాహకులు పి. శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డాక్టర్ భరత్‌కుమార్‌గౌడ్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆటలతో శారీరక, మానసిక ఉల్లాసం వస్తుందన్నారు. స్పీడ్ వాకింగ్ చేయడం వల్ల రక్త ప్రసరణ జరిగి గుండె ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. కొత్తకోట ప్రజలకు ఆరోగ్య వాకింగ్ క్లబ్ ఆదర్శంగా నిలిందని, ఈ క్లబ్‌ను పదేళ్లుగా విజయవంతంగా నిర్వహిస్తున్న క్లబ్ నిర్వాహకులు శేఖర్‌గౌడ్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఆరోగ్య వాకింగ్ క్లబ్ సభ్యులు ఎల్లయ్య, విజయ్, రవీందర్‌రెడ్డి, బాలకృష్టారెడ్డి, రాములు, మేఘారెడ్డి, నగేష్, శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, జగన్, లక్ష్మీరెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోటలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ భరత్‌కుమార్‌గౌడ్

సీఎం పేషీకి ఫిర్యాదుతో న్యాయం

ఆత్మకూర్: తన భూమి తనకు కాకుండా ఇతరుల కబ్జాలో ఉందని, కబ్జా కోరల నుంచి తమ భూమి ఇప్పించి తనకు న్యాయం చేయాలని బాధితురాలు ముఖ్యమంత్రి పేషీలో రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందించడంతో న్యాయం చేకూరింది. గురువారం తహసీల్దార్ చాంద్‌పాషా తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. మండలంలోని బాలకిష్టాపూర్‌కు చెందిన తెలుగు చెన్నమ్మకు సంబంధించిన వ్యవసాయ భూమి మేడేపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 200లో 21 గుంటల భూమి ఉందన్నారు. రికార్డుల పరంగా భూమి ఉన్న ఇతరుల కబ్జాలో ఉండడంతో ఈఏడాది జులై 30న సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. కలెక్టరు ఆదేశాల మేరకు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి సర్వే నిర్వహించి 19 గుంటల భూమిని చెన్నమ్మ పేరిట రికార్డులో చేర్చి పట్టదార్ పాస్‌బుక్కును గురువారం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ ప్రసాద్, కార్యాలయసిబ్బంది ఉన్నారు.



చెన్నమ్మకు పట్టాదారు పాస్‌బుక్కును అందజేస్తున్న తహసీల్దార్ చాంద్‌పాషా

విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు



పెబ్బేరులో..

పాన్‌గల్: విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని పెంచి, సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి చెకుముకి టాలెంట్ టెస్టులు ఎంతగానో ఉపయోగపడుతాయని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు ప్రశ్నాపత్రాలను ఆయన జన విజ్ఞాన వేదిక సంఘం మండల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ సంబరాల పేరుతో జన విజ్ఞాన వేదిక చెకుముకి టాలెంట్ టెస్టులు నిర్వహించడం అభినందనీయమన్నారు. పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, లిటిల్ స్టార్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల స్థాయిలో విజేతలుగా నిలిచారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులు ఈనెల 28వ తేదీన జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు రమేష్, కార్యదర్శి రవికుమార్ తెలిపారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయ్, జన విజ్ఞాన వేదిక నాయకులు అకాష్, దాసరి కృష్ణ, అక్బర్, రోశయ్య పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసలు

వీపనగండ్ల: మండల స్థాయి చెకుముకి పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అభినవ్, లోకేష్, యశ్వంత్‌ను ఆయా పాఠశాల ఉపాధ్యాయులతో పాటు ఎంఈఓ నర్సింహులు అభినందించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు రఘు, జీహెచ్‌ఎం రాజవర్ధనాచారి ఉన్నారు.

పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలో నిర్వహించిన చెకుముకి పోటీలో ప్రభుత్వ పాఠశాల ఇంగ్లిష్ మీడియం విభాగంలో బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు, తెలుగు మీడియం విభాగంలో బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విభాగంలో మోడల్ స్కూల్ విద్యార్థులు, ప్రైవేటు పాఠశాల విభాగంలో మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, పుస్తకాలు బహుకరించారు. పెబ్బేరు ప్రిన్సిపల్ నరేష్ ఆధ్వర్యంలో డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో పెరుమాళ్ల భాస్కర్, నాగశేషు, ప్రధానోపాధ్యాయురాలు శ్రీవిద్య, ప్రిన్సిపల్ తూర్పింటి నరేష్ కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమం

మదనాపురం: కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం సాయంత్రం ఆయా గ్రామాలకు చెందిన వారికి మంజూరయిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీకురుమూర్తి స్వామి దర్శనానికి వచ్చిన మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అబద్ధ ప్రకటనలు చేశారని మండిపడ్డారు. ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీని నమ్మే పరిస్థితిలో లేరని ఎద్దేవా చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే బావబామ్మర్దులు శత విధాల ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నెలివిడి రైతులతో మాయమాటలు చెప్పించిన బీఆర్‌ఎస్ తీరును ప్రజలు గమనిస్తున్నారని మండిపడ్డారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును మరుగున పడేసిన ఘనత బీఆర్‌ఎస్ నాయకులకే చెందుతుందని ధ్వజమెత్తారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాతా

ఆత్మకూర్: ప్రభుత్వం అందిస్తున్న ఆరు గ్యారెంటీలతో పాటు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం ప్రభుత్వ పథకాలను వివరిస్తూ స్థానిక ప్రధాన కూడళ్లలో కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కళాజాత బృందం సభ్యులను అభినందిస్తూ పథకాల తీరును పాటల రూపకంలో ప్రజలకు వివరించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాజాతా బృందం సభ్యులు శ్రీనివాసులు, కృష్ణయ్య, సువర్ణ, రాజు, నర్సింహా, రాధ, శ్రీదేవి తదితరులు ఉన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

సైబర్ నేరాలపై అవగాహన

మదనాపురం: మండలంలోని దుప్పల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం ఎస్‌ఐ శేఖర్ రెడ్డి సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ అందుబాటులోకి వచ్చిన తర్వాత సైబర్ నేరగాళ్లు పెట్రేగిపోతున్నారని, గుర్తు తెలియని వ్యక్తుల నుంచి మెయిల్స్, ఇతర లింక్‌లను ఓపెన్ చేయొద్దని సూచించారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంకుక సంబంధించిన వ్యక్తిగత వివరాలు చెప్పొద్దన్నారు. అనుమానంగా ఏవరైనా గ్రామాల్లో సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎంపీడీఓగా శ్రీరాంరెడ్డి

ఆత్మకూర్: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఉంద్యాల శ్రీరాంరెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్క డ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న సుజా త భర్త ఇటీవలే మృతి చెందడంతో ఆమె లాంగ్‌లీవ్‌పై వెళ్లారు. దీంతో ఎంపీఓగా విధు లు నిర్వహిస్తున్న శ్రీరాంరెడ్డి ఎంపీడీఓగా పూర్తిస్తాయి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి బీరం సుబ్బారెడ్డి శ్రీరాంరెడ్డిని అభినందించారు. మండలంలోని గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా చేపడుతామని, పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈసందర్భంగా శ్రీరాంరెడ్డిని సిబ్బంది, కార్యదర్శులు సత్కరించారు.



కొనుగోలు కేంద్రం పరిశీలన

కొత్తకోట రూరల్: మండంలోని పాలెం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ ఎం.వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హమాలీలు తూకం చేస్తున్న బస్తాలను పరిశీలించడంతో పాటు ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని రైతులను అడిగి తెలుసుకున్నారు. పీఏసీఎస్, కొత్తకోట వారి ఆధ్వర్యంలో 20 కేంద్రాలను ఏర్పాటు చేయగా గురువారం నాటికి 639మంది రైతుల నుంచి లక్ష బస్తాల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు పీఏసీఎస్ చైర్మన్ కొట్టం వంశీధర్‌రెడ్డి, సీఈవో బాలరాజుచారి తెలిపారు. ఇప్పటి వరకు 221మంది రైతుల ఖాతాల్లో రూ.3.91కోట్లు జమ చేశామన్నారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన

వీపనగండ్ల: వ్యాధి నిరోధక టీకాలు వేయించడంలో గ్రామాల్లో ఉండే మహిళలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని మండల వైద్యాధికారి రాజశేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఇంటింటికీ వ్యాధి నిరోధక టీకాల సర్వే నమోదు అనే అంశంపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. మండలంలోని ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు వ్యాధి నిరోధక టీకాలు, పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న వసతులపై ప్రజలకు వివరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయూష్ డాక్టర్లు హేమవర్ధన్, శ్వేత, భాగ్యశ్రీ, కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం

వీపనగండ్ల: పేదలకు కనీస వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బలరాం ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, ఉపాధి, ఇల్లు, భూమి డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సంఘం నాయకులతో కలిసి డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తికి ఒక వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ప్రజా సమస్యలు పరిష్కరించకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల నాయకులు రామకృష్ణ, నాగరాజు, మునికుమార్, అంజి, శేఖర్, జీవరత్నం, శివ, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర చట్టం తేవాలి



వనపర్తి రూరల్: పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చట్టం తేవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గట్టయ్య అన్నారు. గురువారం వనపర్తి మండలంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వేరుశనగ పంటలను ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం రైతుకూలీ, కార్మిక సమస్యలపై ఈ నెల 26న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రైతుల పట్టా భూములను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు చట్టాలు తెస్తూ.. రైతులపై ఎరువులు, పురుగుల ముందుల ధరలు పెంచి భారం మోపుతుందని దుయ్యబట్టారు. ఈ నెల 26న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే నిరసనకు రైతులు, కూలీలు, కార్మికులు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుర్మనాయక్, లక్ష్మి, వెంకటయ్య, నాగరాజు, రైతు కూలీలు తదితరులు పాల్గొన్నారు.

కవర్లలో సారవంతమైన మట్టినే నింపాలి



పాన్‌గల్: నర్సరీల్లో మొక్కల పెంపకం కోసం కవర్లల్లో సారవంతమైన మట్టిని నింపాలని ఎంపీడీఓ గోవింద్‌రావు ఉపాధి సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని బండపల్లి గ్రామ నర్సరీని సందర్శించి కవర్లల్లో మట్టి నింపే విధానాన్ని ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పలు రికార్డులు, అందుతున్న పౌష్టికాహారం, చిన్నారుల హాజరు శాతంపై ఆరా తీశారు.

బీజేపీ బలోపేతానికి కృషి



ఖిల్లాఘనపురం: బీజేపీ బలోపేతానికి గ్రామ స్థాయిలోని బూత్ కమిటీల నుంచి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ వనపర్తి అసెంబ్లీ కన్వీనర్ శ్రీనువాస్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని మానాజీపేటలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి దశరథ ఆధ్వర్యంలో బూత్ కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, శాంతమ్మ, రమేష్, మురళి, రామస్వామి, మహేందర్, మన్యం, అంజనేయులు పాల్గొన్నారు.

వర్గీకరణ తర్వాతే నోటిఫికేషన్లు ఇవ్వాలి

వీపనగండ్ల: ఎస్సీ వర్గీకరణ అమలు చేశాకే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మొల్కలపల్లి పరశురాముడు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఎంఎస్‌ఎఫ్ నాయకులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 6న మాదిక స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చలో మహబూబ్‌నగర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దయ్యపు కృష్ణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, రాముడు, దయ్యపు నాని, కరుణాకర్, రాజశేఖర్, మహేష్, రవివర్మ, ప్రవీణ్ పాల్గొన్నారు.